ప్రజాశక్తి

సోమవారం 12 జూన్ 2023

12 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బిజెపి విద్రోహ పాలనపై..

వామపక్షాలు భగ్గు

◆ విశాఖలో భారీ నిరసన ర్యాలీ

◆ మిన్నంటిన అమిత్‌షా గో బ్యాక్ నినాదాలు

◆ వైజాగ్‌లో అడుగుపెట్టే నైతిక అర్హత అమిత్‌షాకు లేదు : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉద్ఘాటన

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఎపికి ప్రత్యేక హోదా లేదు.. రైల్వే జోన్ విషయంలోనూ మోసం చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధులు రావు. ప్రభుత్వ రంగ ధ్వంసమే లక్ష్యంగా బిజెపి పాలకులు ముందుకు సాగుతున్నారు. అటువంటి వారికి విశాఖలో అడుగుపెట్టే నైతిక అర్హత లేదు' అంటూ సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు ఆదివారం విశాఖలో కదంతొక్కాయి. 10.30 గంటలకు రైల్వే డిఆర్‌ఎం కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజుల నేతృత్వంలో భారీ నిరసన ర్యాలీ సాగింది. విశాఖలో అమిత్ షా పర్యటనను, తొమ్మిదేళ్ల బిజెపి విద్రోహ పాలనను వ్యతిరేకిస్తూ వామపక్షాలు చేపట్టిన ఈ నిరసన ర్యాలీలో 'అమిత్‌షా గో బ్యాక్' నినాదాలు హోరెత్తాయి. ఆర్టీసీ బస్టాండ్ వద్దగల మహాకవి గురజాడ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. అక్కడే బహిరంగ సభ నిర్వహించారు.

ముఖ్యవక్తగా పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎపికి ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, రైల్వే జోన్ వంటి హామీలన్నిటినీ బిజెపి తుంగలో తొక్కిందన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తూ విశాఖలో పర్యటించే నైతిక హక్కు అమిత్‌షాకు లేదన్నారు. పోలవరం నిర్వాసితులకు కేంద్రం ఎంతటి అన్యాయం చేసిందో వివరించారు. ప్రజలకు తీవ్ర ద్రోహం చేసిన బిజెపికి రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మద్దతుగా నిలవడం శోచనీయమన్నారు. కార్మిక వ్యతిరేక బిల్లులు, దేశానికి ప్రమాదకరమైన చట్టాలన్నిటినీ ఈ పార్టీలు ఆమోదించేసి మోడీ భజనపరులుగా మారాయని విమర్శించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో వందల ఎకరాలను గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల మిగతా 2లో..

ఆత్మస్తుతి.. పరనింద..

◆ ఎపి పాలనపై ధ్వజం.. మోడీకి భజన

◆ బిజెపి బహిరంగ సభలో అమిత్ షా సహా నేతల తీరు

◆ రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్ ఊసే లేదు

అమిత్‌షాకు గజమాల వేస్తున్న నేతలు

జనం లేక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'తమను తాము పొగుడుకోవడం ద్వారా ప్రజా సమస్యలను పక్కదోవ పట్టించేయడం, తాము చేయని పనులను చేసినట్లుగా భావిస్తూ తన్మయత్వంతో ఊగిపోతూ తమ అగ్రనేతలను స్తుతిస్తూ ఊకదంపుడు ఉపన్యాసాలతో సభికులను అలరించడానికి తాపత్రయపడడం' ఆదివారం సాయంత్రం నాటి బిజెపి బహిరంగ సభలో కనిపించింది. కేంద్ర హోం శాఖామాత్యులు అమిత్ షా ఉపన్యాసం ఆద్యంతం ఇలానే సాగింది. తమ తొమ్మిదేళ్ల మిగతా 2లో..

బడులకు వేళాయె..! నేటి నుంచే ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నేటి నుంచే విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పాఠశాలలు పున: ప్రారంభంకానున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు దృష్ట్యా పాఠశాలల పున: ప్రారంభాన్ని వాయిదా వేయాలని ప్రతిపక్ష పార్టీలు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరగా.. వేడి గాలుల కారణంగా ఈ నెల 17వ తేదీ వరకూ ఒంటిపూట బడులు నిర్వహించేందుకు ప్రభుత్వం మిగతా 2లో..

కొనసాగుతున్న రైళ్ల రద్దు

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మానవహారం చేపట్టిన వామపక్ష పార్టీల కార్యకర్తలు

వామపక్షాలు భగ్గు

పేరిట అదానీకి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కట్టబెట్టడం దారుణమన్నారు. గిరిజన ప్రాంత గ్రామసభల అనుమతుల్లేకుండా ధారాదత్తం చేసే విధానాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. దేశంలో పలువురు మేధావులు, రాజకీయ పార్టీల నాయకులు బిజెపి విద్రోహ విధానాలపై తిరగబడుతున్నారని, రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు అది చూసి నేర్చుకోవాల్సి ఉందని అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మోడీ హయాంలో ప్రజలకు ఎంతటి నష్టం జరిగిందో వివరించారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు ఎన్.లక్ష్మి మాట్లాడుతూ నల్లధనాన్ని వెలికితీసి దేశంలో ప్రజలందరి అకౌంట్లలో రూ.15లక్షలు చొప్పున వేస్తానని మోడీ చేసిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అనంతరం ఆప్ రాష్ట్ర యువజన విభాగం కన్వీనర్ కె.గణేష్ మాట్లాడారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు క్షేత్రపాల్, కె.విమల, వై.కొండయ్య, డాక్టర్ బి.గంగారావు, బి.పద్మ, ఎస్కె.రెహమాన్, చంద్రశేఖర్, ఎం.వెంకటేశ్వర్లు, రాంబాబు, బి.వెంకట్రావు, పి.మణి, పి.పైడిరాజు, కె.సత్యనారాయణ, ఎం.సుబ్బారావు, పి.చంద్రశేఖర్, కుమారి, గణేష్, ఆష్రఫ్, ఆప్ రాష్ట్ర నాయకులు డాక్టర్ సీతల్ పాల్గొన్నారు.

బడులకు వేళాయె..!

అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో ఉదయం 7:30 గంటల నుంచి 11:30 గంటల వరకే తరగతుల నిర్వహణ ఉంటుందని విశాఖ, అనకాపల్లి జిల్లాల విద్యాశాఖాధికారులు తెలిపారు.

ఆత్మస్తుతి.. పరనింద..

పాలనను పొగడుకుంటూ.. ప్రపంచం అంతా మోడీ జపమే చేస్తోందంటూ కితాబులతోనూ, గత కాంగ్రెస్ పాలనను దుయ్యబట్టడం, ఎపిలో వైసిపిపై ధ్వజమెత్తడంతోనే అమిత్ షా ఉపన్యాసం అంతా సాగిపోయింది. ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ గురించిన మాట అమిత్ షా నోట రాలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఊసు కూడా ఎత్తలేదు. కానీ 'కాశ్మీర్ మనదా ? కాదా ? అంటూ మధ్య మధ్యలో 'భారత్ మాతాకి జై' అనే నినాదాన్ని సభికుల నుంచి చెప్పిస్తూ ప్రజలను ఉద్వేగంలో ముంచెత్తేలాగ చేతులెత్తాలంటూ అమిత్ షా గట్టిగా అరుస్తూ మాట్లాడారు. పదేపదే అబద్ధాలు చెప్పుకొచ్చారు.

అంతా మోడీ జపమే !

అమిత్ షా హోం శాఖ మంత్రి అయి ఉండి కూడా దేశంలో మహిళలకు కేంద్రం ఇచ్చే భరోసా, రక్షణ వంటి అంశాలనుగానీ, దేశంలో శాంతి భద్రతల విషయాన్నిగానీ ఎక్కడా ప్రస్తావించలేదు. మోడీ జపం చేస్తూ ఉపన్యాసంలో సగభాగం భజన చేశారు. ప్రపంచం అంతా మోడీని హీరోలా భావిస్తుందంటూ వ్యాఖ్య చేశారు. గత కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడుతూ ఎపిలో జగన్ పాలనపైనా ధ్వజమెత్తాడు. కేంద్రం ఇచ్చే రేషన్ బియ్యానికి జగన్ బొమ్మ తగిలించుకుని సోకులు చేస్తున్నాడన్నారు. విశాఖకు రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలెవరైనా వచ్చారంటే విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి మాట్లాడకుండా ఉండరన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనం చేసి దేశ, విదేశీ కార్పొరేట్లకు కట్టబెట్టాలన్న విధానం తీసుకున్న బిజెపి విశాఖ బ్రాండ్ ఇమేజ్ అయిన స్టీల్‌ప్లాంట్‌పై ఈసారీ కనీసం మాట్లాడలేదు. ప్రైవేటీకరణ ఉపసంహరించుకుంటున్నట్టు ఎలాంటి ప్రకటనా చేయలేదు.

విశాఖ అభివృద్ధికి కేంద్రం ఏం చర్యలు తీసుకుంటుందో చెప్పకుండా ఇక్కడ సంఘ విద్రోహులు పెరిగిపోయారంటూ హోం మంత్రి వ్యాఖ్యలు చేయడం ఒక రకంగా దిగజారుడుతనంగా చెప్పొచ్చు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఇస్తానని ఇవ్వకుండా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్న కేంద్రం చర్యలను ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజానీకం, మేధావులు నిరంతరం తప్పుపడుతూనే ఉన్నా దీనిపై నోరెత్తి మాట్లాడలేదు. ఉన్నఫలంగా వాల్తేరు డివిజన్‌ను ఎత్తేసి పాపం మూటగట్టుకున్న బిజెపి వచ్చే ఎన్నికల్లో 300 సీట్లకుపైగా కావాలని, ఎపి నుంచి 20 సీట్లు కావాలని కోరడం అత్యాసే అవుతోంది. ఇదిలా ఉండగా కనీసం 50 వేలు మంది బహిరంగ సభకు వస్తారని బిజెపి నేతలు గొప్పలుపోగా ఆదివారం నాటి సభకు ఏడు వేల మంది కూడా రాలేదు. వందల కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

పాఠశాలలు సంసిద్ధం

సకాలంలో విద్యార్థులకు జెవికె కిట్లు పంపిణీ
పూర్తయిన నాడు - నేడు పనులు
'ప్రజాశక్తి'తో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'జిల్లాలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 1498 పాఠశాలలున్నాయి. నేటి నుంచి ఈ పాఠశాలలు పున:ప్రారంభంకానున్నాయి. మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు జగనన్న విద్యా కానుక (జెవికె) కిట్లు చేరాయి. మనబడి - నాడునేడు రెండో దశ కింద 586 పాఠశాలల్లో ప్రహరీ మినహా మిగిలిన మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తయ్యాయి. బదిలీల్లో కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు సోమవారం జాయిన్ కావాల్సివుంది' అని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో నాడు - నేడు పనులు, జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ సన్నద్ధత వంటి వివరాలు తెలిపారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే..

ప్రభుత్వ పాఠశాలల సన్నద్ధత ఎలా వుంది ?

సోమవారం నుంచి పాఠశాలలు పున:ప్రారంభంకానున్నాయి. విద్యార్థులకు అసౌకర్యం లేకుండా పాఠశాలలను సిద్ధంచేశాం. బదిలీల్లో కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు సోమవారం జాయిన్ కావాల్సివుంది.

జెవికె కిట్లు పాఠశాలలకు చేరాయా?

జిల్లాలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాల కింద 1498 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి పది వరకు 1,23,971 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ సరిపడా జెవికె కిట్లు మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు చేరాయి. విద్యార్థుల జాబితా ప్రకారం ఉపాధ్యాయులు పంపిణీ చేయనున్నారు.

విద్యార్థులకు ఇచ్చే జెవికె కిట్లు ఏంటి ?

జెవికె ద్వారా బ్యాగు, బెల్టు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, జత

బూట్లు, రెండు జతల సాక్స్‌లు, మూడు జతల యూనిఫాం క్లాత్, ఆరు నుంచి పది విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు, ఒకటి నుంచి ఐదు విద్యార్థులకు పిక్టోరియల్ నిఘంటువు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. వీటిని సకాలంలో విద్యార్థులకు పంపిణీ చేయనున్నాం.

నాడు - నేడు రెండో దశ పనులు పూర్తయ్యాయా ?

మనబడి - నాడు నేడు రెండో దశ కింద 586 పాఠశాలల్లో ప్రహరీ మినహా మిగిలిన మౌలిక సదుపాయాల కల్పన పనులన్నీ పూర్తయ్యాయి. పాఠశాల మరమ్మతులు, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్, విద్యుదీకరణతో సహా ఫ్యాన్లు, ట్యూబులైట్లు, తాగునీటి సౌకర్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఫర్నీచర్, పాఠశాల భవనాలకు రంగులు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీష్ ల్యాబ్, వంట గదుల నిర్మాణం రెండో దశ పనుల్లో వున్నాయి.

అమిత్ షాకు ఉక్కు నిరసన సెగ

ప్రజాశక్తి - ఉక్కునగరం,

విశాఖకు వచ్చిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకుంటున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో రాస్తారోకో, ధర్నా చేపట్టారు. పెద్ద సంఖ్యలో ఉక్కు కార్మికులు, నిర్వాసితులు, వారి కుటుంబీకులు తరలివచ్చి 'సేవ్ వైజాగ్ స్టీల్' నినాదాలు చేశారు. ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పోరాటాలతో కాపాడుకుంటామని స్పష్టం చేశారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ లాభాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టు పెట్టిన జగన్ సర్కారు తీరును ఖండించారు. రాష్ట్రంలో మిగిలి ఉన్న ఒకే ఒక్క ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్‌ప్లాంట్ అని, లక్షలాది కోట్ల రూపాయలు విలువచేసే ఈ ప్లాంట్‌ను కాపాడుకుంటామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రాజశేఖర్, కెఎస్ఎన్.రావు, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో నిర్వహిస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

కొనసాగుతున్న రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఖరగ్‌పూర్ డివిజన్ ఖరగ్‌పూర్-భద్రక్ సెక్షన్‌లోని బహనాగ బజార్ స్టేషన్‌లో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 జూన్ 12న 22878 ఎర్నాకులం-హౌరా ఎక్స్‌ప్రెస్, జూన్ 13న 22853 షాలిమార్-విశాఖపట్నం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 22807 సంత్రాగచ్చి-ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, 22887 హౌరా-సర్ ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ ఎక్స్‌ప్రెస్, 22825 షాలిమార్ - ఎంజిఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 12774 సికింద్రాబాద్ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
S.O.P. 6/2023

Between:
1.Sridharala Savithri
2.Sridharala Venkata Ramesh
3.Sridharala Venkata Suresh
4.Mandavilli Vijaya Lakshmi
5.Chennuri Lakshmi **...Petitioners**
And
1.Coramandal International Pvt. Ltd.,
2. KFin Technologies Private Limited
...Respondents

GENERAL NOTICE

The public in general are hereby informed that the above named petitioners filed the above petition to issue Succession Certificate in their favour enabling them to transfer the schedule mentioned Coromandal International Pvt. Ltd., equity shares in their names, which stands in the name of the deceased Sridharala Venkata Rao who died on 09-04-2015. The above matter stands posted to **17-07-2023.** Therefore the public in general are hereby informed that if anyone having objections in the above matter, please appear before the Hon'ble Court on **17-07-2023** at **10:30 A.M.** and intimate the objections, failing which the matter will be decided exparte in your absence as per law.

B.K. NAIDU, Advocate
Visakhapatnam-27,
Cell: 9848077747.

801వ రోజుకు స్టీల్ జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 801వ రోజుకు చేరుకున్నాయి. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు దీక్షల్లో కూర్చున్నారు. వారినుద్దేశించి సంఘం అధ్యక్షులు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడమే పనిగా ముందుకు సాగుతున్న బిజెపికి రానున్న కాలంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.కృష్ణ, యు.సోమేష్, శ్రీను, కె.నారాయణ, సిహెచ్.రాముడు, ఆర్ఎన్.ఆంజనేయులు, శ్యామ్, సురేష్, బి.సత్తిబాబు, ఎం.వాసు, తులసీరావు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

జిలకర్ర అన్నపూర్ణ W/oలేటు రామారావు గారి భార్య అనునేను ఇచ్చు ప్రకటన నాకు చోడవరం గ్రామం బోళ్ళవీధిలో డోర్.నెం.8-162 గల ఇల్లు నాది అది నాపేరుపై ఉన్నది, అది పూర్వము ఇల్లు దాని తాలుకా ఓరిజినల్ డాక్యుమెంట్ దస్తావేజులు పోయినది. కావున నేను పోలీస్‌స్టేషన్‌లో కంప్లయింట్స్ ఇచ్చాను. మరల పత్రిక ప్రకటన కూడా ఇస్తున్నాను.

జిలకర్ర అన్నపూర్ణ
చోడవరం
సెల్:9963444831

స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో ప్రథమ స్థానమే లక్ష్యం

'ఇకో - వైజాగ్' 1కె వాక్ ప్రారంభించిన మేయర్

'ఇకో-వైజాగ్' 1 కె రన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో ప్రథమ స్థానమే లక్ష్యంగా నగర ప్రజల సహకారంతో సాధిస్తామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. ఆర్‌కె.బీచ్ కాళీమాత గుడి నుంచి సబ్‌మెరైన్ వరకు 1కె వాక్‌ను జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ్-2022లో దేశంలోనే విశాఖ నాలుగవ స్థానం సాధించిందని,ప్రజలు స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో మంచి ఫీడ్ బ్యాక్ ఇచ్చి విశాఖ నగరాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం అడిగిన ప్రశ్నలకు ప్రజలు ఫీడ్ బ్యాక్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే నగర స్వచ్ఛతకు జివిఎంసి యంత్రాంగం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. స్వచ్ఛ భారత్ అంబాసిడర్లు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ర్యాంకుకు కృషి చేయాలని కోరారు. విశాఖ నగరాన్ని పరిశుభ్రత నగరంగా తీర్చిదిద్దేందుకు "ఇకో-వైజాగ్" కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రజల అవగాహన కోసం 1కె వాక్ ప్రారంభించినట్లు చెప్పారు. విశాఖ నగరంలో నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలన అమల్లో ఉందని, అయినా కొంతమంది వ్యాపారస్తులు తక్కువ ధరకే దొరుకుతుందని ఆ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రత్యేక స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేశామని, నిషేధిత ప్లాస్టిక్ కలిగి ఉన్న దుకాణదారుల నుంచి భారీ స్థాయిలో అపరాధ రుసుం వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో అందరి సహకారంతో విశాఖ నగరానికి మొదటి ర్యాంకు సాధిద్దామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో "ఇకో-వైజాగ్" కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. 1 కె వాక్ ద్వారా స్వచ్ఛత, పారిశుధ్యం, ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, డిసిఆర్ ఫణిరామ్, కార్యదర్శి నల్లనయ్య, జోనల్ కమిషనర్లు, ఎఎంఒహెచ్, స్వచ్ఛ భారత్ అంబాసిడర్లు, స్వచ్ఛంద సంస్థలు, నగర పౌరులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక నేరెళ్ళవలస కాలనీకి చెందిన అరసవల్లి సతీష్ (28) అప్పుల బాధ తాళలేక శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు అతన్ని దగ్గర్లో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎఎస్ఐ రామం కథనం ప్రకారం... శనివారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఇంట్లోని గది తలుపులు మూసివేసి ఉండడంతో భార్య తలుపు తట్టినా సతీష్ తీయలేదు. వెంటనే భార్య, కుటుంబ సభ్యులు తలుపు పగులకొట్టి లోపలకు వెళ్లారు. గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మ చేసుకుని కనిపించాడు. భార్య కొండ, ఇద్దరు పిల్లలు ఐదేళ్ల గౌతమ్, మూడేళ్ల వరుణ్, కుటుంబ సభ్యులు భోరున విలపించారు. మృతుడు పెయింటర్‌గా పనిచేసేవాడు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నారు. మతుని భార్య ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ రామం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రెండు దుకాణాల్లో చోరీలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పట్టణంలో శనివారం రాత్రి రెండు దుకాణాల్లో చోరీలు జరిగాయి. దుకాణాల్లో నగదు లేకపోవడంతో కొన్ని సామాన్లను అపహరించుకుపోయారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఎలక్ట్రికల్ హార్డ్వేర్ షాపులో షట్టర్ తొలగించి రూ.500 చిల్లరను తీసుకెళ్లారు. నర్సీపేట వద్ద సాయి మార్బుల్ షాపు పైకొప్పు తొలగించి సామాన్లు తీసుకెళ్లారు. దీనిపై స్థానిక సీఐ బి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాంబే కాలనీలో పొంగుతున్న భూగర్భ డ్రైయినేజీ

భూగర్భ డ్రెయినేజీ లీకేజీతో ఇక్కట్లు

ప్రజాశక్తి -మధురవాడ : భూగర్భ డ్రెయినేజీ పొంగిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 7వ వార్డు పరిధి వాంబే కాలనీ నిర్మాణం సమయంలో భూగర్భ డ్రెయినేజీని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం అది పూర్తిగా మరమ్మతులకు గురైంది. ముఖ్యంగా 31, 42 బ్లాకుల వద్ద ఈ భూగర్భ డ్రెయినేజీ పొంగి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీనివల్ల ఈగలు, దోమలు ప్రబలుతున్నాయి. కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి భూగర్భ డ్రెయినేజీకి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

13న 6 గంటల వరకే అప్పన్న దర్శనాలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం అప్పన్న సోదరి అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా ఈ నెల 13వ తేదీన సింహాద్రి అప్పన్న ఆలయంలో భక్తులకు సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే దర్శనం ఉంటుందని ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తలెఇపారు. బుధవారం ఉదయం 6:30 గంటల తర్వాత యధావిధిగా భక్తులకు దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఘనంగా ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

వార్షికొత్సవ కేక్‌ను కట్ చేస్తున్న గొలగాని శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ 14వ వార్షికోత్సం ఆదివారం ముడసర్లోవ రహదారి స్కిల్ డెవలెప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి సీనియర్ నాయకులు గొలగాని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై వార్షికోత్సవ కేక్‌ను కట్ చేశారు. కేక్‌ను అసోసియేషన్ సభ్యులకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 14 ఏళ్లుగా నిర్విరామంగా ఈ ప్రాంతంలో వాకర్స్ అందరూ అసోసియేషన్‌గా ఏర్పడి వ్యాయామం, యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తూ యువతను నడిపిస్తున్నారన్నారు. వీటితో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం గొలగాని శ్రీనివాసరావును అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మూర్తి, ఈశ్వరరావు, సభ్యులు సత్కరించారు. అసోసియేషన్ సభ్యులను ముఖ్యఅతిథి శ్రీనివాసరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు వైసిపి ఇన్‌చార్జ్ కెల్ల సత్యనారాయణ, అసోసియేషన్ ఉపాధ్యక్షులు శంకరరావు, సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

సాయిగణపతిలో బ్రిడ్జి కోర్సు తరగతులు

పోస్టర్ విడుదల చేస్తున్న సాయి గణపతి కళాశాల ప్రిన్సిపల్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గిడిజాలలోని సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాలలో రెండు వారాలు పాటు ఉచితంగా బ్రిడ్జి కోర్సు తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎమ్.మహేశ్వరరావు తెలిపారు. 10వ తరగతి పాసై పాలిటెక్నిక్ చదవడానికి ఆసక్తిగల విద్యార్థులకు ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఇప్పటివరకు చదివిన సబ్జెక్టుకు పాలిటెక్నిక్ సబ్జెక్టును అనుసంధానిస్తూ ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఎటువంటి ప్రవేశ రుసుము లేకుండా నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఉచిత ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాలలో ప్రిన్సిపల్ విడుదల చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న ఇంటర్న్‌షిప్ విద్యార్థినుల వస్తు ప్రదర్శన

విద్యార్థినులు తయారుచేసిన వస్త్రాలను పరిశీలిస్తున్న సిఐ సోమశేఖర్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్ లని దయాల్‌నగర్ దయాల్‌బాగ్ ఇనిస్టిట్యూట్‌లో ఇంటర్న్‌షిప్ చేసిన సెయింట్ జోసెఫ్ కాలేజీ బిఎస్‌సి విద్యార్థినులు తయారుచేసిన వస్తు ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను ఆరిలోవ సిఐ సోమశేఖర్ ఆదివారం ప్రారంభించారు. సుమారు 40 రోజుల పాటు తర్ఫీదు తీసుకొని తయారుచేసిన వస్తువులను కాలనీ వాసులు వచ్చి కొనుక్కున్నారు. ఈ సందర్భంగా సిఐ సోమశేఖర్ మాట్లాడుతూ, ఇంటర్న్‌షిప్ నిమిత్తం తర్ఫీదు పొంది, అందరికీ ఉపయోపడే వస్త్రాలను తయారుచేసిన విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఇన్‌ఛార్జి దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం చేస్తున్న ఫాబ్ ప్రతినిధులు

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇంటర్ పూర్తిచేసి బిఎస్సీలో చేరేందుకు ఓ విద్యార్థినికి రూ.10 వేలు ఆర్థికసాయాన్ని స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ భీమిలి (ఫాబ్) ప్రతినిధులు ఆదివారం భీమిలిలో అందజేశారు. ఇందుకు గాను ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థికసాయం అందజేసిన వారిలో ఫాబ్ ప్రతినిధులు కాళ్ళ సన్నీ, ఎం.సూర్యశ్రీనివాస్, వి.సత్యనారాయణ, జి.సాయి, కె.నరేంద్రకుమార్, దేవానంద్‌రాజు, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై నేలకొరిగిన భారీ వృక్షం

ప్రజాశక్తి-సింహాచలం: సింహగిరిపై శనివారం రాత్రి కురిసిన వర్షానికి ఎన్నో ఏళ్లుగా ఉన్న భారీ వృక్షం నేలకొరిగింది. ఎండాకాలం, వర్షాకాలంలో భక్తులకు, వాహనాలకు, చిరు వ్యాపారులకు ఈ చెట్టు నీడనిచ్చేది. ఈ చెట్టు నేల కూలడంతో దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు ఆదివారం తెల్లవారుజామున కొండపైకి చేరుకొని యంత్రాల సహాయంతో చెట్టు భాగాలను తొలగించారు.

పేద కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : కీర్తిశేషులు కె.సీతారాం కుటుంబానికి ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. స్థానికులు జగుపిల్ల సూరిబాబు పుట్టిన రోజు సందర్భంగా ఆయన ఆర్థిక సాయంతో 1992 టెన్త్ విద్యార్థులు వర్మ, హేమ, సుబ్బారావు, పి.శ్రీను, కె.శ్రీను, జి.సురేష్ తదితరులు నిత్యావసర సరుకులు అందజేశారు. సూరిబాబుకు టెన్త్ 1992 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పేద కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కేక్ కట్ చేస్తున్న శైలేష్

ఘనంగా అంబటి శైలేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి సిటీ యూత్ జనరల్ సెక్రెటరీ అంబటి శైలేష్ జన్మదిన వేడుకలు ఒక హోటల్లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, విశాఖ స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జివి), విశాఖ యూత్ వింగ్ అధ్యక్షులు అల్లా శివ గణేష్, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, వైసిపి సీనియర్ నాయకులు కాశీ విశ్వనాథం, శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీధర్, 14వ వార్డు కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మాట్లాడుతూ తన పుట్టినరోజు వేడుకలకు విచ్చేసిన ప్రతి ఒక్కరికీ అంబటి శైలేష్ కృతజ్ఞతలు తెలిపారు.

మురుగునీటితో దుర్వాసన

ప్రజాశక్తి-సీతమ్మధార : జీవిఎంసీ 26వ వార్డు పరిధిలోని శ్యామలమ్మ గుడి వెనుక నాలుగు రోజులుగా కాలవలోని మురుగునీరు రోడ్డుమీద ప్రవహించడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజులుగా రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తున్నా జివిఎంసి పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా జివిఎంసి అధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సిఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు క్రమశిక్షణతో మెలగాలని, అనవసర తగాదాల్లో తలదూర్చకుండా ఉండాలని సూచించారు. వివాదాలకు కారకులైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ద్వారక పోలీస్‌స్టేషన్ పరిధిలో సిఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. గొడవలు, సెటిల్‌మెంట్‌లకు పాల్పడకుండా తమ తమ పనులు చేసుకోవాలని సూచించారు లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాజశేఖర్‌కు సత్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : రోటరీ విశాఖ పోర్టు సిటీ ఆధ్వర్యాన ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్‌ను ఆదివారం ప్రయివేటు ఫంక్షన్ హాల్లో సత్కరించారు. రోటరీ గవర్నర్ భాస్కరరామ్ విశ్వనాథం సమక్షంలో 9 రోటరీ క్లబ్బుల సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి.రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించి ప్రశంసలు అందుకున్నారు. వ్యాఖ్యానానికి మంత్రముగ్దులైన రోటరీ గవర్నర్ భాస్కరరామ్ వీరిని ప్రశంసించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ విశాఖ పోర్టు సిటీ అధ్యక్షులు యుఎస్.శర్మ, కార్యదర్శి సుధీర్ చౌదరి, కోశాధికారి కె.కళాధర్‌రాజు, డివి.వర్మ తదితరులు పాల్గొన్నారు.

శాఖాహార సద్భావన ర్యాలీ

ప్రజాశక్తి -గాజువాక : పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ ఆధ్వర్యాన గాజువాక బిసి రోడ్డు నుంచి శాఖాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పిరమిడ్ మాస్టర్స్ శాఖాహార విశిష్టతను తెలియజేస్తూ నినదించారు. అన్ని వీధుల్లో తిరుగుతూ కరపత్రాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్స్ రేవతి దేవి, శివగణేశ్వరరావు, జయలక్ష్మి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించిన సుప్రీంకోర్టు జడ్జి దంపతులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఆదివారం సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో వి.త్రినాధరావు సాదరంగా స్వాగతం పలికారు. ఈ దంపతులు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారిని ఈవో త్రినాధరావు సాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.

చెత్త పన్నుపై పోరాటం చేయండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గాజువాక : చెత్త పన్నుపై మరింత ఉధృతంగా పోరాటం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో చాలా కాలం సిపిఎం పోరాటాల్లో పాల్గొని ప్రస్తుతం గాజువాక పరిధి తోకాడ సమైక్య అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న కొల్లి సత్యనారాయణ మాస్టారును పరామర్శించేందుకు శ్రీనివాసరావు ఆదివారం వచ్చారు.

సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

'ఎలా ఉన్నారు మాస్టారూ' అని పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అపార్టుమెంట్‌లో ఏర్పాటు చేసిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ చెత్త పన్నుపై సమైక్య అపార్టుమెంట్ వాసులు చుట్టుపక్కల ఉన్న అపార్టుమెంట్ల వారిని కలుపుకుని పోరాడాలన్నారు. విజయవాడలో అందరూ ఐక్యంగా ఉంటూ చెత్త పన్ను కట్టని విషయాన్ని గుర్తు చేశారు. విశాఖలోనూ 12 డివిజన్లలో చెత్త పన్ను కట్టలేదని తెలిపారు. పెన్షన్ ఆపుతామని బెదిరింపులు దిగినా పేదలు, పట్టణ వాసులు చాలా ఏరియాల్లో ప్రభుత్వంపై తిరగబడటంతో సర్కారు వెనక్కు తగ్గిందన్నారు. చెత్త పన్ను ప్రపంచ బ్యాంకు షరతుల్లో భాగమేనన్నారు. కరెంట్ బిల్లులు గత నెలతో పోలిస్తే దారుణంగా ఈ నెల పెరిగాయన్నారు. విద్యుత్ ఛార్జీల మోతనూ ప్రతిఘటించాలన్నారు. సమైక్య అపార్టుమెంట్ నాయకులు బి.తౌడన్న అధ్యక్షతన జరిగిన ఈ సభలో

కొల్లి సత్యనారాయణ మాస్టారును పరామర్శిస్తున్న వి.శ్రీనివాసరావు

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, అపార్టుమెంట్ నాయకులు చిన్నం నాయుడు, చౌదరి, రమణ, రామన్న, స్వప్న, మణి, పద్మ, హేమలత పాల్గొన్నారు.

మంచి సినిమాలను ప్రేక్షకులకు దగ్గర చేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : మంచి సినిమాలను ప్రేక్షకులకు దగ్గర చేయడమే వైజాగ్ ఫిలిం సొసైటీ ముఖ్య ఉద్దేశమని సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని గాంధీ సెంటర్లో నిర్వహించారు. సొసైటీ గౌరవాధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి పాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోవా ఫిలిం ఫెస్టివల్ హాజరయ్యేందుకు, ఎన్‌టి రామారావు జయంతి నిర్వహణకు సంబంధించి అంశాలపై మాట్లాడారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీకి కార్యాలయం, సభ్యుల చేరిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు, ఉపాధ్యక్షులు ఎ.కాశీవిశ్వేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ వి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, డాక్టర్ ఆర్.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష మందితో అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రైల్వే న్యూ కాలనీలోని భారత స్వాభిమాన్ ట్రస్ట్ ఆఫీసులో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హరిద్వార్ నుంచి స్వామి రిత్ దేవ్ వచ్చారని విశాఖపట్నం అధ్యక్షులు టిఎస్‌వి.ప్రసాదరావు తెలిపారు. ఈ సమావేశంలో స్వామి రిత్ దేవ్ మాట్లాడుతూ, ఈ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా విశాఖ జిల్లాలో 100 మెగా యోగా శిబిరాలు నిర్వహించాలని, ఒక్కొక్క శిబిరంలో 1000 మందితో, సుమారు లక్ష మందితో అంతర్జాతీయ యోగా దినోత్సవం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. విశాఖ జిల్లా భారత స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షులు టిఎస్‌వి.ప్రసాదరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ, కార్యాలయాల్లో, ప్రైవేట్ సెక్టార్లో, పాఠశాలల్లో, కళాశాలలో, వార్డుల్లో, పార్కుల్లో ట్రైనీ టీచర్స్‌తో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ట్రైనింగ్ యోగా టీచర్స్ ఎవరికైనా కావాలంటే 6301413438 ద్వారా తమ సంస్థను సంప్రదించాలని సూచించారు. మాజీ అధ్యక్షులు సాయి నాగేశ్వరరావు ఆధ్వర్యాన ఆదివారం విశాఖలోని ముఖ్య వీధులలో యోగా కార్యకర్తలు జండాలు పట్టుకొని తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతస్వాభిమాన్ ట్రస్టు రాష్ట్ర అధ్యక్షులు చినబాబు, రామ ముని, పతంజలి యోగ సమితి జిల్లా కార్యవర్గం, పతంజలి డివిజన్ యోగా కార్యకర్తలు నాగేశ్వరరావు, సోమేశ్వరరావు, ప్రభాకర్, రవికుమార్, శైలజ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో పర్యటించిన స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ జాయింట్ సెక్రటరీ

జిందాల్ విద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రూపామిశ్రా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : స్వచ్ఛ భారత్ అర్బన్ జాయింట్ కార్యదర్శి రూపామిశ్రా ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలలో జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె కాపులుప్పాడలోని జిందాల్ విద్యుత్ కేంద్రాన్ని, బయోమైనింగ్, ఘన వ్యర్థాల విభజనతో పాటు రుషికొండ, వైఎస్ఆర్ వ్యూపాయింట్, బీచ్ రోడ్డులోని వైఎంసిఎ వద్ద ఆధునికరించిన మోడ్రన్ మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం హోటల్ ర్యాడిసన్‌లో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా ఏ అంశాలు, ఏ ఏ పనులు చేపడుతున్నారో ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా ఇప్పటివరకు చేపట్టిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అర్బన్ జాయింట్ సెక్రెటరీకి వివరించారు. ముఖ్యంగా ఘన వ్యర్థాల విభజన, సెంద్రీయ ఎరువు తయారీ, మెరుగైన పారిశుధ్యం, భూగర్భ మురుగనీటి వ్యవస్థ, నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలన, కాలుష్య నియంత్రణ, బహిరంగ మలమూత్ర విసర్జనతో పాటు సామూహిక మరుగుదొడ్లు పరిశుభ్రత పాటించడం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆమె కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కస్మేడి క్యు నూతన బ్రాంచి ప్రారంభంలో...

విశాఖలో కస్మేడి క్యు నూతన బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అత్యాధునిక నూతన టెక్నాలజీతో చర్మం, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ క్లినిక్ సేవలు విశాఖలో అందుబాటులోకి వచ్చాయి. రామ్‌నగర్‌లో సకల సదుపాయాలతో ఏర్పాటుచేసిన కస్మేడి క్యు నూతన బ్రాంచిని సంస్థ ఫౌండర్ తేజ వినోద్ ప్రారంభించారు. కస్మేడి క్యును ప్రారంభించి కేవలం మూడేళ్ళ వ్యవధిలోనే 3 బ్రాంచిలను ప్రారంభించి 5000 మందికి స్కిన్ అండ్ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్వీసెస్ సేవలను అందించినట్లు తేజవినోద్ తెలిపారు. మధురవాడ, గోపాలపట్నం బ్రాంచ్‌లతో పాటు కొత్తగా రాంనగర్‌లో సేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అవంతి, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ శ్రావ్యకృష్ణ, ఫుడ్ అండ్ న్యూట్రిషనిస్టు సింధూర పంచకర్ల పాల్గొన్నారు.

నేటి నుంచి దుర్గాలమ్మ పండగ

ప్రజాశక్తి -మధురవాడ : చంద్రంపాలెం గ్రామ దేవత దుర్గాలమ్మ పండగ మహోత్సవాన్ని సోమవారం నుంచి రెండు రోజులు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, అధ్యక్షులు పిళ్ళా శేఖర్, పిళ్ళా సూరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ పండగను గత నెలలోనే ప్రారంభించామని, పాలిమేరలో ఉన్న అమ్మవారికి ప్రతి వారమూ పసుపు, కుంకుమలు ఇస్తూ వచ్చామన్నారు. సోమ, మంగళవారంతో పండగ పూర్తవుతుందన్నారు.

ఈ పండుగ సందర్భంగా మధురవాడ పరిసర ప్రాంత ప్రజలు, బహుళ అంతస్తుల భవనంలో నివసించు వాహన చోదకులు 13, 14 తేదీలలో మిదిలాపురి ఉడా రోడ్డు జంక్షన్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు జాతీయ రహదారుల ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్డులో కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణాలు సాగించాలని కోరారు. పండగకు వచ్చే బంధుమిత్రులు కొమ్మాది వైపు నుంచి వచ్చే కార్లు, ద్విచక్రవాహనాలు వాంబే కాలనీ రోడ్డులో ఏర్పాటుచేసిన స్థలంలో విశాఖపట్నం వైపు నుంచి వచ్చేవారు దుర్గానగర్-2 జంక్షన్ నుంచి ఎన్‌జిఒ లే-అవుట్ రోడ్డు పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

గ్రంథాలయాల్లో ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

పెందుర్తి గ్రంథాలయంలో ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న శరగడం నరసింహమూర్తి

కె.కోటపాడులో విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి-యంత్రాంగం

గ్రంథాలయాల్లో మే 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు పిల్లలకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం, సర్టిఫికెట్లును ముఖ్య అతిథులు ద్వారా అందించారు.

పెందుర్తి : పెందుర్తి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా పెందుర్తి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ శరగడం నరసింహమూర్తి పాల్గొన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి పూర్తి సహయ సహకారాలు అందిస్తానని చెప్పారు. గ్రంథాలయానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పన కోసం ఎమ్మెల్యే అదీప్ రాజ్, గ్రంథాలయ చైర్మన్ కొండ రమాదేవితో చర్చించి నిధులు సాధిస్తామని పేర్కొన్నారు. స్థానిక వ్యాపారవేత్త దాడి రమణచిట్టి మాట్లాడుతూ పిల్లలకు ఆసక్తికర అంశాలపైనే తల్లిదండ్రుల దృష్టిసారించి చదివించాలని సూచించారు. పిల్లలకు ఈ వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. సమరస ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ శరగడం సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. సంగీతం, నాట్యం నేర్చుకునే వారికి అవసరమైన వస్తువులను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. పెందుర్తి గ్రంథాలయం కేంద్రంగా స్పోర్ట్స్, బ్లడ్ డొనేషన్ అసోసియేషన్ ఏర్పాటుచేయాలని గ్రంథాలయ అధికారి సూర్యకళకు సూచించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ మాట్లాడుతూ, గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థులు కూర్చోడానికి కుర్చీలు, టేబుళ్లను దాతలు విరాళంగా ఇవ్వాలని కోరారు. వేసవి శిక్షణ శిబిరం విజయవంతంగా పూర్తి కావడానికి సహకరించిన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు భూలోకం, కార్యదర్శి ఆడారి రామకృష్ణ రిసోర్స్ పర్సన్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు జ్ఞాపికలు అందజేశారు. రిసోర్స్‌పర్సన్‌లను, సంగీత నాట్య గురువులను ముఖ్య అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారవేత్త ఆళ్ల సత్యనారాయణ, గ్రంథాలయ కమిటీ ఉపాధ్యక్షులు భూలోకం, కార్యదర్శి ఆడారి రామకృష్ణ, సీనియర్ జర్నలిస్టు వద్దాది ఉదయకుమార్, ఆరోగ్య శిబిరాల నిర్వాహకులు దాడి శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్స్, సంగీత, నాట్య గురువులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.

ములగాద : చిన్నారులు ప్రతిరోజూ కొత్త విషయాలను నేర్చుకోవాలని, విజ్ఞానాన్ని పెంచుకోవాలని, అందుకు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న చిన్నారుల వేసవి శిక్షణా శిబిరం ముగింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు పుస్తక పఠనంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ 35 రోజుల శిబిరంలో నేర్చుకున్న అంశాలను అమల్లోపెట్టాలని సూచించారు. సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనంతో పాటు, కంప్యూటర్ జ్ఞానాన్ని కూడా పెంచుకోవాలన్నారు. కొత్త విషయాలను నేర్చుకోవాలనే తపన, నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవాలనే కోరిక గ్రంథాలయాల వల్ల నెరవేరుతాయని చెప్పారు. గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయదేవి, పాత్రికేయులు సుంకర చలపతిరావు, కవి కె.సత్తిరాజు, కార్మిక నాయకులు బి.సత్యానందం, 61వ వార్డు వైసిపి అధ్యక్షులు దాడి సత్యనారాయణ, నాయకులు అప్పలరెడ్డి, సోను మాస్టర్, సతీష్, పి.సిద్ధార్థ తదితరులు మాట్లాడారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. శిబిరంలో పాల్గొన్న 60 మంది చిన్నారులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు.

మల్కాపురం గ్రంథాలయంలో మాట్లాడుతున్న కొణతాల సుధ

ఆనందపురం : ఆనందపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు చందక సూరిబాబు మాట్లాడుతూ బాలలందరూ గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కె.రెడ్డిబాబు మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా అపారమైన విజ్ఞానం సంపాదించుకోవచ్చన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు 40 మందికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ కె.సత్యమూర్తి, నాయకులు చందక సూరిబాబు, కొట్యాడ రెడ్డిబాబు, చందక అప్పలనాయుడు, నారాయణ రావు, వరలక్ష్మి, పోస్టుమాస్టర్ కృష్ణ పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపునకు కార్పొరేటర్ పీవీ నరసింహం హాజరై సరస్వతి దేవి విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కాగితంతో వివిధ రకాల వస్తువులను తయారుచేయడాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ స్థలదాత దాసరి సన్యాసిశెట్టి గ్రంథాలయ అధికారి నరసింహం, లాయర్ రామకృష్ణ, భానుమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న విజ్ఞాన వేసవి శిబిరం ఆదివారం ఘనంగా ముగిసాయి. గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె.ఎన్.గాంధీ హాజరయ్యారు. చిన్నారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు శ్రీనివాసరాజు, సీతారామయ్య, అచ్యుతరావు, వాసుదేవరావు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు వేడుకలు ఆదివారం గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు రంగబాబు ,స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయురాలు శ్రీదేవి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజులు బండారు చారిటబుల్ ట్రస్ట్ అధినేత గోవిందరావు సమకూర్చిన బహుమతులను అందజేశారు.

కోటవురట్ల: గ్రంథాలయాలు విజ్ఞాన భాండా గారాలు అని మండల విద్యాశాఖ అధికారి అప్పారావు తెలిపారు. చిన్నారులు ప్రతినిత్యం గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిల్ కుమార్, స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొండబాబు, హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ వాసు పాల్గొన్నారు.

గొలుగొండ: శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో సరస్వతి దేవి, గ్రంథాలయ ఉద్యమ నేతలకు ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ అప్పారావు, ఎంఇఒ సత్యనారాయణ, హిందీ ఉపాధ్యాయురాలు రాఘవకుమారి, సీఆర్పీ రామకృష్ణమాస్టారు, రిసోర్స్ పర్సన్ విశ్వనాథుని రాజబాబు పాల్గొన్నారు.

చీడికాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు శిక్షణ శిబిరాలు నిర్వహించామని లైబ్రేరియన్ ఎమ్మెస్ ఎల్ జోగేశ్వరి తెలిపారు. బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను కూడా అందజేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షులు పరవాడ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : వేసవి సెలవులు సందర్భంగా గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. మునగపాక శాఖ గ్రంథాలయంలో జరిగిన ముగింపు ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా ఎంపిపి మళ్ల జయలక్ష్మి, జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు పాల్గొని మాట్లాడారు. శిక్షణ శిబిరం రిసోర్స్ పర్సన్స్ శివకోటి దుర్గాప్రసాద్, కిల్లాడ దుర్గాప్రసాద్, ఆశా దేవి, జగదీష్‌లను ఘనంగా సత్కరించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయాధికారి ఎల్ల రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, పిల్లి అప్పారావు, ఆడారి కాశి బాబు, విశ్రాంత ఉపాధ్యాయులు పెంటకోట తులసిరావు, ఎస్.ప్రసాదరావు పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక గ్రంథాలయం వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ చిట్టిబాబు మాట్లాడుతూ గ్రంథాలయం ద్వారా విజ్ఞాన్ని సంపాదించుకోవచ్చని తెలిపారు. న్యాయవాది సూరా శ్రీనివాస్‌ను సత్కరించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజనీ, విశ్రాంత ఉద్యోగి నంబా రమణ, శిష్ట అప్పారావు, వైసిపి నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, గ్రంథాలయం అధికారి యస్ వరలక్ష్మి పాల్గొన్నారు. తాళ్ళపాలెం శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్‌పిటిసి లగిశెట్టి భవానీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట లక్ష్మి, ఉపాధ్యాయులు సురేష్ కుమార్, వైసిపి నాయకులు లగిశెట్టి గణేష్, గ్రంథాలయం అధికారి కాంగ్రేగులు జగన్ విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డాదిలో...

సబ్బవరంలో...

సబ్బవరం : గ్రంథాలయాలు విజ్ఞానానికి సోపానాలని, ప్రతి విద్యార్థి గ్రంథాలయనికి వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోవాలని స్థానిక సిఐ పి.రంగనాథం విద్యార్థులకు సూచించారు. స్థానిక గ్రంథాలయాధికారి వి.శిరీషా ఆధ్వర్యంలో వేసవి శిక్షణా తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం వేసవి శిక్షణా తరగతులలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాణి, సుభాషిణి, చందు, జనార్దన్, చంటి పంతులు తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో విద్యార్థిని బహుమతి అందిస్తున్నఅతిథులు

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖ గ్రంథాలయంలో మే 8 నుండి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులు ఆదివారంతో ముగిశాయి. గ్రంథాలయ అధికారిని ఎం పద్మావతి విద్యార్థులకు ప్రతిరోజు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విజేతలకు గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు. ఎంపీటీసీ ఏటికూరి రాజేష్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

వడ్డాది : వడ్డాది గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా గ్రంథాలయం అధికారి వై వెంకటేశ్వర్లు వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అతిథి దేవో భవ స్వచ్ఛంద సేవ సంస్థ నిర్వాహకుడు అరిపాక కామేశ్వరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవివరం గ్రంథాలయంలో మాట్లాడుతున్నకార్పొరేటర్ పివి.నరసింహం

నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో....

కశింకోట గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఎంఇఒ చిట్టిబాబు

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
సోమవారం 12
జూన్ 2023

విజయాలు.. ఆయన సొంతం

విద్యా రంగం నుంచి.. రాజకీయ రంగం వరకూ అంతటా గెలుపే

గొప్ప వ్యూహకర్తగా పేరు.. అభివృద్ధి పనుల్లో మేటి

ఇదీ భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి ప్రస్థానం

ప్రజాశక్తి - భీమునిపట్నం

విజయాలు ఆయన సొంతం. గెలుపు వ్యూహాలకు ఆయన పెట్టిందిపేరు. అభివృద్ధి పనుల్లో మేటిగానూ ఆయనకు మాంచి పేరుంది. విద్యారంగం నుంచి రాజకీయ రంగంలోకి ప్రవేశించి అందరి తలలో నాలుకలా మారిన ఆ వ్య(శ)క్తే ముత్తంశెట్టి శ్రీనివాసరావు. అందరి నోటా అవంతి శ్రీనివాస్‌గా పిలవబడే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఏ రంగంలో అడుగిడినా సరే, అతనికి ఉన్న నిబద్ధత, చిత్తశుద్ధి అతన్ని అగ్రగామిగా నిలిపాయి. అటు విద్యా రంగంలోగానీ, ఇటు రాజకీయ రంగంలోగానీ అవంతి అడుగులు ఒడి ఒడిగా విజయం వైపుగానే నడుస్తున్నాయి.

అంచెలంచెలుగా ఎదుగుదల

సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ముత్తంశెట్టి తన స్వయం కృషితో అటు అవంతి విద్యాసంస్థల అధినేతగా, ఇటు రాజకీయ రంగంలో నియోజక వర్గ ప్రజలు మెచ్చే ప్రజా ప్రతినిధి (ఎమ్మెల్యే)గా, జగన్ సర్కారులో రాష్ట్ర మంత్రిగా ఎంతగానో రాణించారు. 1990లో హైదరాబాద్‌లో అవంతి కంప్యూటర్స్ పేరుతో సాఫ్ట్‌వేర్ శిక్షణా సంస్థను ప్రారంభించినట్లు ఆయన చెబుతుంటారు. అనంతరం అవంతి పేరుతో ఒకప్పటి ఉమ్మడి రాష్ట్రంలో డిగ్రీ, ఇంజినీరింగ్, పిజి తదితర కళాశాలలు నెలకొల్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నెలకొల్పిన పలు అవంతి విద్యా సంస్థల్లో కొన్ని వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

మరో వైపు ఆయా విద్యా సంస్థల్లో ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. అంతేగాకుండా అవంతి ఫౌండేషన్ ఏర్పాటుతో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఇక్కడ చదివి ఇతర దేశాల్లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడే వారు ఏ స్థాయిలో ఉన్నా సరే పుట్టిన గడ్డ (పల్లె, పట్టణం)కు, తల్లిదండ్రులకు, దేశానికి సేవ చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి తరచూ విద్యార్థులకు చెబుతుంటారు. తాను ఈ స్థాయికి ఎలా చేరుకోగలిగానో విద్యార్థులకు ప్రతి సందర్భంలోనూ పదే పదే సార్లు చెబుతూ ఉంటారు.

ముక్కుసూటిగా మాట్లాడతారు

ఎవరో ఏమో అనుకుంటారేమో, తనకు వ్యక్తిగతంగా, రాజకీయంగా నష్టం వస్తుందేమో అని ఏమాత్రం ఆలోచించకుండా చెప్పాల్సిన విషయం ముక్కు సూటిగా, నిర్మొహమాటంగా, ఖరాఖండిగా కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం ముత్తంశెట్టి నైజం. ఇది అతని బలమో, బలహీనత అనాలో చెప్పలేంగానీ అతని సహజ స్వభావం. రాజకీయ పార్టీ సభలు, సమావేశాల్లోగానీ, ఇతర ఏ సందర్భంలోగానీ అధికారులు, రాజకీయ నాయకులు, కార్యకర్తల సమీక్షా సమావేశాల్లోగానీ ఏదైనా అంశం చర్చకు వచ్చినప్పుడు ఆయా అధికారులు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలపై ముత్తంశెట్టి శ్రీనివాసరావు సహజంగానే ఒకింత ఆగ్రహం ప్రదర్శిస్తుంటారు. అంతలోనే సంబంధిత వ్యక్తుల పట్ల అంతే ఆప్యాయత, అనురాగం కనబరుస్తారు. నా మాటలు ఏ ఒక్కరినీ నొప్పించాలని కాదు, నాపై అపార నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా ఎన్నుకున్న ప్రజలకు న్యాయం చేయాలన్నదే తపనని, అంతేగానీ ఏ ఒక్కరిపైనా తనకు వ్యక్తిగతంగా ద్వేషంగానీ, కోపంగానీ ఉండవని అనేక సందర్భాల్లో ఆయన చెప్పారు.

రాజకీయ రంగంలోనూ...

ప్రముఖ సినీ హీరో, మెగాస్టార్ చిరంజీవి ఉమ్మడి రాష్ట్రంలో 2009లో అనూహ్యంగా ప్రజారాజ్యం పేరుతో రాజకీయ పార్టీని స్థాపించారు. అదే పార్టీ అభ్యర్థిగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు భీమిలి నుంచి ఎన్నికల బరిలో దిగారు. అప్పటి వరకు రాజకీయంగా ప్రత్యక్ష సంబంధాలు లేని ఆయన తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం 2014లో టిడిపి నుంచి అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2019లో వైసిపి నుంచి మళ్లీ భీమిలి నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా పని చేసి ప్రజల సమస్యలు పరిష్కరించారు.

ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

విశాఖ అంటే మక్కువ

తన అభివృద్ధికి దోహదపడిన విశాఖ నగరం అంటే అవంతికి ఎనలేకి మక్కువ. విశాఖ నగరాన్ని అభివృద్ధి చేయాలి. ప్రపంచ స్థాయిలో మన విశాఖ నగరం ఉండాలన్నదే ఆయన తపన. అందుకే ఆయన పర్యాటక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు విశాఖ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. విశాఖ నగరాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తాపత్రయపడ్డారు. పర్యాటకం అంటేనే ఉత్సవాలు, ఎక్కువ ఉత్సవాలు జరిగితే అధిక సంఖ్యలో పర్యాటకులు విచ్చేస్తారని గమనించి భీమిలి, విశాఖ, అరకు ఉత్సవాలకు నాడు పెద్దపీట వేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా భీమిలి, అరకు, విశాఖ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో స్థానిక కళాకారులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

సేవా కార్యక్రమాలు

ముత్తంశెట్టి శ్రీనివాసరావు లయన్స్ క్లబ్‌లో చేరి పేద ప్రజలకు సేవలు అందించడానికి తనవంతు కృషి చేశారు. లయన్స్ క్లబ్‌లో రీజినల్ విభాగాధిపతి పదవి కూడా నిర్వహించారు. అవంతి ఫౌండేషన్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అవార్డులను చూపుతున్న అంజిబాబు, రామారావు

ఉత్తమ సేవలకు అవార్డులు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కుంచ అంజి బాబుకు, గ్రామీణ ప్రాంతాల్లో పలు లఘు చిత్రాలను పరిచయం చేసిన వేగి రామారావుకు హైదరాబాదుకు చెందిన హోలీ ప్రిన్స్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వారు అవార్డుల అందజేశారు. ఆదివారం వీరిద్దరూ స్థానిక విలేకరులతో మాట్లాడారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సేవా కార్యక్రమాల్లో యువతకు చేయూతనిస్తూ పేదవారిని ఆదరిస్తూ కార్యక్రమాలు చేసినందుకు 2023 భారత సేవారత్న పురస్కారాన్ని అందజేశారని కుంచ అంజిబాబు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో 30కి పైగా లఘు చిత్రాలను రచించి దర్శకత్వం వహించినందుకు ఉత్తమ లఘు చిత్రాల అవార్డును అందుకున్నట్లు వేగి రామారావు చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం నుండి వివిధ కేటగిరీల్లో సుమారు 100 మందికి అవార్డుల అందించగా అనకాపల్లి జిల్లా నుండి నలుగురు వ్యక్తులకు వివిధ కేటగిరీల్లో అవార్డులు గెలుచుకున్నారని తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -మునగపాక రూరల్

స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం రాత్రి సినీ నటుడు నందమూరి బాలకృష్ణ 63 జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నందమూరి అభిమానులు కేక్ కటింగ్ చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాడి ముసలి నాయుడు, దాడి శివ, పెంటకోట విజయ్, భీమరశెట్టి శ్రీనివాసరావు, ఏపిఎం సత్యనారాయణ, కోరుకొండ రాంప్రసాద్, విల్లూరు నర్సింగరావు, మల్ల వరాహ నరసింహారావు, వెలగా మురళి, పి శ్రీరామ్ మూర్తి, బొడ్డేడ శ్రీను, సూరిశెట్టి శ్యామ్, దుర్గ నాయుడు, పూసర్లసత్యనారాయణ, బొడ్డేడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల 2000-2002 ఇంటర్మీడియట్ సీఈసీ గ్రూప్ విద్యార్థులు 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్థానిక ఇరువాడ జివిస్ కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు విశ్వనాద్, రాజేష్, కిషోర్‌లు మాట్లాడుతూ తాము ఇంటర్ విద్య అభ్యసించి రెండు దశాబ్దాలు పూర్తయిందని, నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విందు, వినోదాలను పాలు పంచుకున్నట్లు చెప్పారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మామిడి రైతు దిగాలు

- ధర లేక దిక్కుతోచని స్థితి
- ఇతర రాష్ట్రాలకు తగ్గిన ఎగుమతులు

ప్రజాశక్తి- చోడవరం

మామిడి రైతులు, తోటలు కొనుక్కున్నవారు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. పండ్లు అమ్ముడుపోక రోడ్లు వెంబడి గుట్టలు గుట్టలుగా పోసి అమ్ముతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఈదురుగాలులు, వడగల్లు వానలతో అపార నష్టాన్ని చవి చూసిన వీరికి, మిగిలి ఉన్న పండ్లు అనుముకుందామన్న పైసలు రాని పరిస్థితి ఏర్పడింది. గతంలో మామిడి పండ్లు దొరికితే చాలు ఎంత ధర కైనా కొనుక్కునే వినియోగదారులు ప్రస్తుతం చౌకగా లభిస్తున్నా వాటిని చూసి కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో మామిడి తోటలు సాగు చేసే రైతులు, వేలాది రూపాయలు వెచ్చించి తోటలు కొనుక్కున్న వారు దిక్కుతోచని పరిస్థితిల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

రోడ్డు పక్కన మామిడి పండ్లు అమ్మకానికి పెట్టిన రైతు

చోడవరం, చీడికాడ, బుచ్చయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో అనేక చోట్ల మామిడి తోటలు విరివిగా వేశారు. ఈ ఏడాది ఈ మామిడి తోటల్లో కాయలు విరివిగా కాశాయి. చోడవరం మండలంలో అడ్డూరు తదితర ప్రాంతాల్లో మార్కెట్లో బాగా అమ్ముడుకుపోయే రకాలను సాగు చేస్తూ ఉన్నారు. వీటిలో బంగినపల్లి, సువర్ణ రేఖ, చెరుకు రసాలు వంటివి మార్కెట్లో ఎక్కువగా వినియోగదారులు కొనుక్కుంటారు. అయితే ఈ ఏడాది మామిడి పండ్ల కారు చౌకగా అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

గతంలో తూర్పుగోదావరి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల నుండి కోల్‌కతా, ఒడిశా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు మామిడి పండ్లు అధికంగా ఎగుమతి అయ్యేవి. దీంతో మామిడి పండ్ల వ్యాపారులు తోటలు కొనుగోలు చేసి మామిడి పండ్లను ఎగుమతి చేసేవారు. కాని ఇటీవల కాలంలో ఆయా ప్రాంతాలకు ఎగుమతులు తగ్గాయి. తోటలకు చీడపీడలు ఆశించి కాయ నాణ్యత తగ్గడం, మచ్చలు ఏర్పడ్డం, వడగల్లువానల వల్ల కాయ దెబ్బతినడం వంటి కారణంగా ఆ రాష్ట్రాలకు మామిడి పండ్ల రవాణా తగ్గిపోయింది. దీనికి తోటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి కాని తూర్పుగోదావరి జిల్లాల నుండి మామిడి పండ్ల కూడా ఇక్కడికి పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్నాయి. దీంతో ఇక్కడ కారు చౌకగా అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీనికి తోడు పక్వానికి రాకుండా కాయలు కోసి రసాయనాలు పోసి మగ్గబెట్టడంతో పండ్ల రుచి తగ్గుతూ ఉండడంతో వినియోగదారుల పండ్లు కొనుగోలు చేయకపోవడానికి కారణంగా తెలుస్తుంది. గతంలో వయసుతో నిమిత్తం లేకుండా మామిడి పండ్లను ప్రతి ఒక్కరూ ఎంత ఇష్టంగా తినేవారు. రాను రాను షుగరు, బీపీ వంటి వ్యాధులు వయసుతో సంబంధం లేకుండా వస్తుండడంతో వీటి బారిన పడినవారు మామిడి పండు జోలికి వెళ్లడం లేదు. అమ్మకాలు తగ్గడలకు ఇది కూడా ఒక కారణంగా కనిపిస్తుంది.

ఈ ఏడాది ధరలు తగ్గిపోవడంతో చెట్లనుండి కాయలు దించిన కూలి కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. కొన్నిచోట్ల కాయలు దించకుండా చెట్లకు వదిలేశారు. 100 పండ్లు ఉండే బుట్ట గతంలో రూ.700 నుండి రూ.800 వరకు మేలు రకం పండ్ల ధర పలికేది. ప్రస్తుతం చోడవరం మార్కెట్లో బుట్ట ధర రూ.300 నుండి రూ.400కు మించి అమ్ముడుపోవడం లేదు. అదికూడా అరకొరగానే అమ్మకాలు జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాలకు మామిడి ఎగుమతులు తగ్గడంతో వ్యాపారులు తోటల వద్ద పంట కొనుగోలు చేయడం మానేశారు. దీంతో రైతులే నేరుగా రోడ్ల పక్కన దుకాణాలను పెట్టి తమ పండ్లును అమ్మకాలు చేపడుతున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు మండు ఎండలో కూర్చున్న సకం పండ్లు కూడా అమ్ములు పోలేదని రైతులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మామిడి తోటలు తీసివేయడం తప్ప మరొక గత్యంతరం లేదని రైతులు వాపోతున్నారు.

నూకాంబిక అమ్మవారి ఘటాల ఊరేగింపు

ప్రజాశక్తి -అనకాపల్లి

పట్టణంలోని జివిఎంసి 81వ వార్డు వన్ వే ట్రాఫిక్ జంక్షన్ డౌన్లో నెయ్యిల వీధి ప్రాంతవాసులు 158 ఘటాలతో ఎంతో భక్తిశ్రద్ధలతో నూకాంబిక అమ్మవారి వీధి పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో టిడిపి 81వ వార్డు ఇన్‌ఛార్జి మల్ల సురేంద్ర ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఘట్టాలు ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెయ్యిల వీధి ప్రాంతంలో ప్రతి సంవత్సరం ఉమ్మడిగా పండగ జరుపుకోవడం ఆనవాయితీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక స్థాయిలో మహిళలు, నెయ్యిల వీధి పెద్దలు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘటాలను ఊరేగిస్తున్న మల్ల సురేంద్ర, భక్తులు

అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో సెలవులు పొడిగించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అధిక ఎండలు, ఉష్ణోగ్రతల నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు వారం రోజుల పాటు పొడిగించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బడులు తెరవకుండా ఎండలు తగ్గేవరకు సెలవులు కొనసాగించాలని ముఖ్యమంత్రిని, విద్యాశాఖ మంత్రిని కోరారు.

సిగ్నలింగ్, కమ్యూనికేషన్‌లను నియంత్రిస్తున్న నాడీ వ్యవస్థ

అంతర్జాతీయ న్యూరోసర్జరీ నిపుణులు డాక్టర్ మల్ల భాస్కరరావు

డాక్టర్ మల్ల భాస్కరరావును సత్కరిస్తున్న గౌరీ గ్రంథాలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి

శరీరంలోని సిగ్నలింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలను నాడీ వ్యవస్థ నియంత్రిస్తుందని అంతర్జాతీయ న్యూరోసర్జరీ వైద్య నిపుణులు, కేంద్ర ప్రభుత్వ నిమ్‌హేన్స్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్, బెంగుళూరు) ఆసుపత్రి న్యూరోసర్జరీ విభాగం పూర్వపు ప్రధాన అధిపతి డాక్టర్ మల్ల భాస్కరరావు తెలిపారు. గౌరీ గ్రంథాలయంలో 'నరాల వ్యాధుల నివారణ-చికిత్స' అన్న అంశంపై శనివారం రాత్రి జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కొన్ని ఆరోగ్య పరిస్థితులు మెదడుకు సంచలనాన్ని కలిగించే నరాలను ప్రభావితం చేస్తాయన్నారు. మధుమేహం వల్ల 30 శాతం నరాల నొప్పులు వస్తాయని తెలిపారు. అవయవాలు సరిగ్గా పనిచేయడానికి ఆరోగ్యకరమైన నాడీ వ్యవస్థ అవసరమని, నెట్‌వర్క్‌లో ఎక్కువ నరాలకు నష్టం జరిగితే సంబంధిత పనితీరు దెబ్బతింటుందని స్పష్టం చేశారు. డయాబెటిక్ న్యూరోపతి, పోస్ట్-హెర్పెటిక్ న్యూరల్జియా, ఉల్నార్ నరాల పక్షవాతం, కార్పల్ టన్నెల్ సిండ్రోమ్, పెరోనియల్ నరాల పక్షవాతం, బెల్ పక్షవాతం వ్యాధుల నియంత్రణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 100కి పైగా వివిధ నరాలవ్యాధులు నిర్ధారణ చేయబడ్డాయని, కాలక్రమంలో మరిన్ని బయటపడవచ్చని తెలిపారు. రోగ నిర్ధారణకు నరాల బయాప్సీ చేయవచ్చన్నారు. నిరంతరం ఏదో ఒక పనిచేయాలని, లేకుంటే మెదడులోని కణాలు చచ్చిపోయి మతిమరుపు వస్తుందని హెచ్చరించారు. మెదడుకు రక్తం సరఫరా సక్రమంగా జరగకపోతే పిట్స్ వ్యాధి, పక్షవాతం సోకుతుందని చెప్పారు. మెదడు నిరంతరం చురుగ్గా పని చేయాలంటే రోజూ అరగంట నడవడం, సంగీతం వినడం, యోగా, ధ్యానం చేయడం, ఆహార నియమాలు పాటించడం చేయాలని సూచించారు. మానవ శరీరంలో అన్ని భాగాలు మార్చవచ్చుగాని మెదడును మార్చడం వీలుకాదని, అందువల్ల మెదడు ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని సూచించారు.

ఈ సందర్భంగా డాక్టర్ మల్ల భాస్కరరావును గ్రంథాలయం, పలు స్వచ్ఛంద సంస్థలు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం న్యూరాలజీ రోగులను ఆదివారం తెల్లవారుజామున 2 గంటల వరకు పరీక్షించారు. గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు ఎం.వి.బెనర్జీ, బివిఎం.ప్రసాద్, కె.అచ్చన్ననాయుడు, గౌరీ గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, ప్రోగ్రాం కన్వీనర్ మళ్ల బాపునాయుడు, కోశాధికారి బి.కృష్ణఅప్పారావు, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ (ఎన్ఎఫ్ఐ), బొడ్డేడ జగ్గఅప్పారావు, కాండ్రేగుల పరమేష్ జిల్లా నలుమూలల నుంచి వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అమిత్ షా పర్యటనపై హోరెత్తిన నిరసనలు

అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు, పరవాడ సినిమా హాల్ జంక్షన్‌లో సిఐటియు ఆధ్వర్యాన చేస్తున్న రాస్తారోకో

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యాన ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసనలు హోరెత్తాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు పూనుకోవడంతో పాటు విశాఖ రైల్వే జోన్, ఇతర విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్ షా గో బ్యాక్, గో బ్యాక్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

అనకాపల్లి : కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యటనకు వ్యతిరేకంగా అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్‌లో వామపక్షాలు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, సిపిఐ ఎంఎల్ నాయకులు పి.అజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తూ అంబానీ, అదానీలకు సంపదను దోచి పెడుతుందని విమర్శించారు. విశాఖ రైల్వే జోన్ ఇవ్వలేదని, ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్ర బిజెపి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరరావు, బుగిడి నూక అప్పారావు, ఐద్వా నాయకులు జి.సుబాషిణి, సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, వియ్యపు రాజు, తాకాసి వెంకటేశ్వరరావు, పాత్రపల్లి వీరు యాదవ్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : కేంద్ర హోంమంత్రి పర్యటనను నిరసిస్తూ ఆదివారం కె.కోటపాడు, ఎ.కోడూరు గ్రామాల్లో వామపక్ష పార్టీలు నిరసనలు చేపట్టాయి. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు గండి నాయన బాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తూ, విభజన హామీలను అమలు చేయకుండా ఆంధ్రకు తీరని అన్యాయం చేస్తూ ఏ మొహం పెట్టుకొని విశాఖపట్నంలో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యర్రా దేముడు, ముత్యాలనాయుడు, గాడి ప్రసాద్, సిపిఐ నాయకులు రెడ్డి అప్పలనాయుడు, ఇల్లాకు రాము, పొంతపల్లి రామారావు, సీమసిరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

నర్సీపట్నంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

నర్సీపట్నం టౌన్ : విశాఖపట్నంలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా పర్యటనను నిరసిస్తూ నర్సీపట్నం అబిడ్స్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు డిసి హెచ్ క్రాంతి మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 ఏళ్ల కాలంలో ఆంధ్ర రాష్ట్రానికి ఏమి చేసిందని ప్రశ్నించారు. అమిత్ షా ఏ మొహం పెట్టుకొని విశాఖపట్నంలో విజయోత్సవ సభను ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదాపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు సూర్యప్రభ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎల్వి.రమణ, మిడ్ డే మీల్స్ రాష్ట్ర అధ్యక్షులు కే.ప్రసన్న, రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణింద్ర కుమార్, సిపిఎం నాయకులు లోవరాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో

పరవాడ: అమిత్ షా పర్యటనకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యాన పరవాడ సినిమా హాల్ జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.నాయుడు, బి.అప్పారావు, జి.అప్పారావు, సిహెచ్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలుపుదల చేస్తామని అమిత్ షా ప్రకటన చేయాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, ఉక్కు నిర్వాసితులు సంఘం ఆధ్వర్యాన పెదగంట్యాడ జంక్షన్లో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గాజువాక వైసిపి ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ, పార్టీలకు, యూనియన్లకు అతీతంగా సోషల్ మీడియా ద్వారా, ప్రజా సంఘాలతో కలిసి ఐక్యంగా ప్రజా ఉద్యమం నిర్మించినప్పుడే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై వెనక్కి తగ్గుతుందన్నారు. ప్రతి ఉద్యోగి, కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, మేధావులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం అధ్యక్షులు గోందేశీ సత్యారావు, పులి వెంకటరమణారెడ్డి, మార్టుపూడి పరదేశి, గోందేశీ మహేశ్వరరెడ్డి, మసేనురావు, పిట్టా రెడ్డి, డివి.రమణ, మంత్రి శంకర్ నారాయణ, సిఐటియు నాయకులు కణితి అప్పలరాజు పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

పెదగంట్యాడ జంక్షన్‌లో...

బ్రాండిక్స్ ఆధ్వర్యాన కంటి పరీక్షలు

ప్రజాశక్తి అచ్యుతాపురం

బ్రాండిక్స్ అపరల్ సిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం బ్రాండిక్స్ ఆవరణలో నిర్వహించిన 108వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 290 మంది కంటి రోగులను వైద్యులు పరీక్షించారు. బ్రాండిక్స్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమంలో పదిమంది యువకులు రక్తదానం చేశారు. వైద్య శిబిరం అనంతరం 25 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. 54 మంది రోగులకు మందులు అందజేశారు. 24 మంది కంటి రోజులకు క్యాటరాక్ట్ సర్జరీ చేయించాలని వైద్యులు సూచించారు. వైద్య శిబిరానికి విచ్చేసిన రోగులకు మజ్జిగ భోజనం యాజమాన్యం కల్పించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ, బ్రాండిక్స్ ఇండియా ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న నిపుణులు

సంహితకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు కవిత, శ్రీనివాస్ గుప్తా

మద్రాస్, బొంబాయి ఐఐటిలకు సంహిత ఎంపిక

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం పట్టణానికి చెందిన బోగవెల్లి సంహిత దేశంలో పేరున్న మద్రాస్, బొంబాయి ఐఐటీలకు ఒకేసారి ఎంపికైంది. అయితే ఆమె కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో బొంబాయి ఐఐటీలో చదవాలని నిర్ణయించుకుంది. సంహిత తిరుపతి ఐఐటీలో బీటెక్ పూర్తి చేసింది. ఐఐటిలకు సంహిత ఎంపిక పట్ల పట్టణంలో నిర్వహిస్తున్న ఆమె తల్లిదండ్రులు బోగవెల్లి శ్రీనివాస గుప్తా, కవితలు ఆనందం వ్యక్తం చేశారు. వీరి పెద్ద కుమార్తె సాత్విక ఫ్రాన్స్ దేశంలో సైంటిస్ట్ గా పనిచేస్తుంది. ప్రస్తుతం ఆమె గ్రీసులో శిక్షణ పొందుతుంది. ఇద్దరు కుమార్తెలు చదువులో చక్కగా రాణించి అభివృద్ధి పథంలో నడవడం ఎంతో ఆనందంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. ఇద్దరూ ఉన్నత స్థాయిలో చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిర్మానుషంగా ఉన్న తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డు

ఎండ వేడి, వడగాలులతో విలవిల

ప్రజాశక్తి- కశింకోట : వాతావరణం మార్పు వల్ల ఆదివారం కశింకోట మండలంలో ఉదయం నుండి ఎండతీవ్రత, వేడి గాలులుతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కొద్ది రోజులుగా ఎండతీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ప్రజలు చెట్లు ఉన్న దగ్గర సేద తీరారు. ఎక్కడికక్కడ రోడ్డు పక్కన వాహనాలు నిలిచి పోయాయి. స్థానికలు సమీపంలో నుయ్యిలు, శారదా నది, ఏలేరు కాలువ ఇతర నీటి కుంటలు స్నానం చేసి సేద తీరారు. జ్యూస్ పాయింట్లు, కూలింగ్ పానీయాల, కొబ్బరి బొండాలు ఎక్కువగా అమ్మకం జరిగింది.

సూరిబాబు కుటుంబానికి టిడిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

గతేడాది జరిగిన ప్రమాదవంలో మృతి చెందిన బుచ్చయ్యపేట సర్పంచ్ సంకర సూరిబాబు కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.50వేలు నగదును ఆదివారం సూరిబాబు భార్య సుంకర లక్ష్మి ఖాతాలో జమ చేశారు. బాధ్యత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు జాతీయ కార్యాలయం స్పందించింది. తక్షణ సహాయం జమ చేసినందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు, మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడుకు సూరిబాబు భార్య లక్ష్మి, కుమారుడు రాకేష్, కుమార్త లావణ్య కృతజ్ఞతలు తెలిపారు.

సుంకర సూరిబాబు భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె

అడ్డాకులకు అందని గిట్టుబాటు ధర

▶▶ కొనుగోలు చేయని జిసిసి ..గత ఏడాది కన్నా తగ్గిన ధర
▶▶ సిండికేట్‌గా వ్యాపారులు నష్టపోతున్న గిరిజనులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: గిరిజనులు పండించిన లేక సేకరించిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం జిసిసి సంస్థను ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం ఆ సంస్థ గిరిజనులు పండించిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయక పోవడంతో వారపు సంతల్లో దళారీలను నమ్మి గిరిజనులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. మైదాన ప్రాంత వ్యాపారస్తులు ఏజెన్సీ ప్రాంతంలోని వారపు సంతల్లోకి వచ్చి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ అధిక లాభాలకు అమ్ముకుంటున్నారు. గతంలో గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తుల్లో అడ్డాకులను కూడా జిసిసి కొనుగోలు చేసేది. గిరిజనులకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసేవారు. సుమారు గత ఆరేడేళ్ల నుంచి జిసిసి కొనుగోలు చేయక పోవడంతో మైదాన ప్రాంత వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. వారంతా సిండికేట్ అయ్యి కొనుగోలు చేస్తుండటంతో అడ్డాకులు సేకరించిన గిరిజనులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

వ్యానులో తరలిస్తున్న అడ్డాకులు

ప్రయాసతో అడ్డాకుల సేకరణ

కుటుంబ సమేతంగా నలుగురైదుగురు గిరిజనులు వారం రోజుల పాటు గ్రామాలకు సమీపంలోని అటవి ప్రాంతానికెళ్ళి అడ్డాకులను సేకరిస్తారు. ఆ తర్వాత చిన్న చిన్న కట్టలు కట్టి ప్రతిరోజు ఎండలో ఆరబెడతారు. ఆ తర్వాత వారపు సంతలకు విక్రయించడానికి తీసుకెళ్లే ముందురోజు అడ్డాకులను దిండ్లిలుగా పెద్ద కట్టలను కట్టి సంతలకు తరలిస్తారు. మారుమూల గ్రామాల నుంచి వారపు సంతలకు తరలించాలంటే సుమారు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరం ఉండటంతో ప్రైవేట్ వాహనాల్లో తరలిస్తున్నారు. ఒక్కో అడ్డాకుల కట్ట (దిండి) కు రూ.80 నుంచి రూ.100ల లగేజీ చార్జీ వాహనదారులు తీసుకుంటున్నారు. సుమారు 30 కేజీల అడ్డాకుల కట్టకు రూ.700 ధర వస్తుంది.

అడ్డాకుల విక్రయాలు చేపడుతున్న వ్యాపారులు

వారం రోజుల కష్టానికి రేటు గిట్టుబాటు కాకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది 30 కేజీల అడ్డాకుల కట్టకు రూ 1000 ధరతో కొనుగోలు చేయగా, ఈ ఏడాది కేవలం.రూ 700నుంచి 800లకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో, రైతులు నష్టపోతున్నారు. డుంబ్రిగూడ మండలంలో శుక్రవారం జరిగిన అరకు వారపు సంతలో సుమారు 30 కిలోల అడ్డాకుల కట్టకు రూ.700 చొప్పున కొనుగోలు చేశారు. దీంతో గిట్టుబాటు కాలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సిన జిసిసి వీటిని కొనుగోలు చేయడం మానేయడంతో మైదాన ప్రాంతం నుంచి వస్తున్న వ్యాపారులు సిండికేట్ అయ్యి వారికి నచ్చిన ధరలో కొనుగోలు చేస్తూ మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారు. దీంతో, వారం రోజుల పాటు గిరిజనులు శ్రమిస్తున్నా గిట్టుబాటు ధర లభించ లేదు. ఈ విధంగా గిరిజనుల కష్టాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అడ్డాకులను జిసిసి ద్వారా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

ఏజెన్సీలో విస్తారంగా కాఫీ సాగు

ప్రజాశక్తి-పాడేరు

ప్రతి ఏటా వేలాది ఎకరాల్లో విస్తరిస్తున్న కాఫీ తోటలు మన్యానికి మణి భారంగా నిలుస్తున్నాయి. గిరిజనులకు ఆదాయ వనరుగా ఉపాధి కల్పనకు కాఫీ ఎంతో దోహదపడుతోంది. ఏజెన్సీలో ఈ ఏడాది కాఫీ కార్యాచరణ ప్రణాళికను అమలు చేసేందుకు ఐటిడిఏ, కాఫీ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఏజెన్సీ 11 మండలాల్లో గిరిజన రైతుల ద్వారా కొత్తగా 16 వేల ఎకరాల్లో కాఫీ తోటల పెంపకానికి 12 వేల 999 ఎకరాల్లో పాత కాఫీ తోటల పునరుద్ధరణ, 15 వేల ఎకరాల్లో కాఫీ తోటల నిర్వహణ పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు.

ఇందుకుగాను కాఫీ రైతులకు పంపిణీ చేసేందుకు రెండు కోట్ల 24 లక్షల 45 వేల 750 కాఫీ మొక్కలను నర్సరీలలో సిద్ధం చేశారు. గత ఐదేళ్లుగా ఏజెన్సీలో అమలు చేస్తున్న కాఫీ కార్యాచరణ ప్రణాళిక ఈ ఏడాది 16 వేల ఎకరాల్లో కొత్తగా కాఫీ ప్లాంటేషన్ చేసేసరికి ఒక లక్ష ఎకరాల్లో కాఫీ తోటల పెంపకం పూర్తవుతుంది. దీంతో, గత 20 ఏళ్ళుగా ఐటీడీఏ ద్వారా గిరిజన రైతులు చేపట్టిన కాఫీ తోటల పెంపకం ఈ ఏడాదితో రెండు లక్షల 40 వేల ఎకరాలకు కాఫీసాగు విస్తరించింది.

ఈ ఏడాది కొత్తగా కాఫీ తోటల పెంపకం ప్రారంభించే రైతులకు ఎకరానికి వెయ్యి చొప్పున కాఫీ మొక్కలను, 100 మిరియాల మొక్కలను పంపిణీ చేసేందుకు ఐటిడిఏ, కాఫీ అధికారులు చర్యలు చేపట్టారు. పాత కాఫీ తోటల పునరుద్ధరణ కోసం ఎకరానికి 225 చొప్పున, పాత తోటల నిర్వహణ కింద గ్యాప్ ఫిల్లింగ్ కోసం ఎకరానికి 200 చొప్పున కాఫీ మొక్కలు రైతులకు పంపిణీ చేపడుతున్నారు.

మండలాల వారిగా అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగూడ, పెదబయలు హుకుంపేట ముంచంగిపుట్టు మండలాల్లో 1000 ఎకరాల చొప్పున, కొయ్యూరు, పాడేరు మండలాల్లో 1500 ఎకరాల చొప్పున జీకే వీధి, జీ.మాడుగుల మండలాల్లో 2 వేల ఎకరాల చొప్పున చింతపల్లిలో 3 వేల ఎకరాల్లో ఈ ఏడాది కొత్తగా గిరిజన రైతులు కాఫీ సాగు చేపట్టబోతున్నారు.

కాఫీ పూత ఆశాజనకం..

పాడేరు ఏజెన్సీలో ఈ ఏడాది కాఫీ పూత ఆశాజనకంగా ఉంది. ఏజెన్సీ 11 మండలాల్లోనూ ఇదే రకంగా కాఫీ పూత, పిందె దశ, మొదలు కావడంతో గిరిజన రైతులు దిగుబడి పెరిగే అవకాశాలపై అంచనా వేస్తున్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా 11 మండలాల్లో ఈ ఏడాది మార్చి నుంచి వర్షాలు మొదలయ్యాయి. ఈ మేరకు గత మూడు నెలల్లో కూడా వర్షాలు బాగా కురిసి కాఫీ పంటకు కలిసి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. పీ పూత, పిందె దశను బట్టి గత ఏడాది కంటే ఈ ఏడాది దిగుబడి పెరిగే అవకాశం ఉందని రైతులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది ఎకరానికి సుమారు 500 కిలోల వరకు కాఫీ పళ్ళు దిగుబడి వస్తే ఈ ఏడాది ఎకరానికి 800 కిలోల వరకు కాఫీ పళ్ళు దిగుబడి రావచ్చునని రైతులు చెబుతున్నారు. ఐటీడీఏ కాఫీ అధికారులు కూడా నిత్యం కాఫీ రైతులతో సమన్వయమై కాఫీ తోటల్లో పంట రక్షణకు దిగుబడి పెంచేందుకు చేయవలసిన పనులపై రైతులకు అవసరమైన తోడ్పాటు శిక్షణను అందిస్తున్నారు.

కాఫీ తోటలను పరిశీలిస్తున్న గిరిజనులు

ఘనంగా సత్తమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి -మునగపాక రూరల్

స్థానిక దళిత కాలనీలో ఆదివారం సత్తమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. అమ్మవారి ఘటాల ఊరేగింపులో భక్తులు పాల్గొని గుడి వరకు డప్పు వాయిద్యాలతో చేరుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్‌రావు, ఎలమంచిలి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు డొక్కా నాగభూషణం, దిమ్మల నూకరాజు, పిల్లి అప్పారావు, గణపతి అప్పారావు, బిలా రాము, గణేష్ ,బీల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘటాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు, భక్తులు

ఇదేం..రోడ్డు విస్తరణ

-ఒక్కో దగ్గర..ఒక్కో విధంగా కొలతలు -ఆక్రమణదారులకు ఇరు పార్టీల నేతల అండ

కొత్తకోట మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోటలో రోడ్డు విస్తరణ పనులు ప్రజల్లో పను అనుమానాలను రేకెత్తిస్తోంది. ఒక్కో దగ్గర ఒక్కో విధంగా రహదారి విస్తరణకు కొలతలు తీస్తుండటంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు కుమ్మక్కవడం విశేషం. కొత్తకోటలో ఇరు పార్టీలకు చెందిన వారికి చెందిన గృహ, దుకాణ సముదాయాలు రోడ్డు ఇరు వెంబడి ఉండటంతో రెవెన్యూ, ఆర్అండ్‌బి, సర్వే బృందం అధికారులతో లోపాయికారి ఒప్పందాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు ఇరు పార్టీల పెద్దలు అధికారులతో పలు దపాలుగా లోపాయి కారిగా చర్చలు కూడా జరిపినట్లు సమాచారం. మార్కింగ్ సమయంలో ఇరు పార్టీల నాయకులు అధికారులకు పలు సూచనలు చేయడంతో ఈ అనుమానాలు మరింత వ్యక్తం అవుతున్నాయి. గ్రామంలో ఆర్అండ్‌బికి చెందిన స్థలం అని తెలిసినా లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించడం, దుకాణ సముదాయాలు కట్టి అద్దెలకు ఇచ్చి లబ్ధి పొందటంతో బల పడిన కొంత మంది నేడు ఆ ఆక్రమణలు తొలగింపునకు గురి కావడంతో ఎలా అయినా విస్తరణ పనులను అడ్డు కోవాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. గత కొన్ని రోజుల కిందట స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామ పెద్దలతో పాటు ఆక్రమణ దారులతో రెండవ దపా నిర్వహించిన సమావేశంలో మండలం తహసీల్దార్, రోడ్డు విస్తరణ పనులకు ఆక్రమణలు తొలగించేందుకు సర్వే సిబ్బందికి సహక రించాలని కోరడంతో పాటు ఆర్అండ్‌బి స్థలాన్ని ఉపయోగించుకొని ఇన్నేళ్లుగా అద్దెల రూపంలో లక్షల రూపాయిలు లబ్ధిపొందిన మీరు ఇకపై విస్తరణ కు తమ పూర్తి సహకారం అందించాలని స్పష్టం చేశారు. ఆర్ అండ్ బి శాఖకు చెందిన స్థలాన్ని ముందుగా గుర్తించి సైడ్ కాలువలు నిర్మించిన అనంతరం రోడ్డు విస్తరణ చేపడతామని నర్సీపట్నం ఆర్అండ్‌బి జెఈ జయరాజ్ ప్రకటించగా...ఆది కార్య రూపం దాల్చలేదు. అయితే తీరా మార్కింగ్ సమయానికి నాయకుల సాయం తో మూడు శాఖల అధికారులను లోబర్చు కున్నట్లు భోగట్ట.

షాపునకు చేసిన మార్కింగ్

ఇందుకు ఉదాహరణగా ప్రస్తుతం వారు వేసిన మార్కింగ్ పలు విమర్శలకు తావిస్తోంది. రోలుగుంట మండలం వెలంకాయపాలెం నుంచి చోడవరం మండలం గంధవరం వరకు రోడ్డు విస్తరణ పనులను న్యూ డెవలప్మెంట్ బ్యాంకు నుంచి రూ.104 కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ చేస్తున్న సంగతి తెలిసిందే.

మొదట 40..ఆ తర్వాత 30 అడుగులు

అయితే అన్ని గ్రామాల్లో ఆక్రమణలు గుర్తించి తొలగించగా, కొత్తకోటలో మాత్రం 15 ఏళ్లుగా విస్త రణకు నోచుకోలేదు. దీంతో, రోడ్డు కిరువైపులా ఆక్రమణలకు గురై కుదించుకు పోయింది. రెండు బస్సులు ఎదురే దురుగా వస్తే వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా 40 అడుగులు తొలగిస్తారని మొదట్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ బహిరంగ సభలో ప్రకటించారు. అలాగైతే దుకాణాలు కొన్ని కనుమరు గవుతున్నాయని భావించి ఇరువైపులా 35 అడుగులకు చేస్తారన్నారు. ఆ తర్వాత 30 అడుగులకు తగ్గించారు. ఇప్పుడు ఇచ్చిన మార్కింగ్ కనీసం 20 అడుగులు కూడా కనిపించడం లేదనే వాదన వినిపిస్తోంది. తరచూ స్థానిక నాయకులతో సమావేశాలు మాత్రం నిర్వహిస్తున్నా, పనుల్లో మాత్రం పురోగతి కనపడలేదు.

ఒక్కో దగ్గర ఒక్కో విధంగా మార్కింగ్

ఎట్టకేలకు మే నెల 26న సర్వే బృందం మార్కింగ్ పనులు చేపట్టగా పలు విమర్శలకు తావిస్తోంది. స్టేట్ బ్యాంకు నుంచి పంచాయతీ, సాయి బాబా దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయం వరకూ సుమారు 70 అడుగుల విస్తీర్ణం మేర మార్కింగ్ చేయగా, అక్కడ నుంచి మార్కింగ్ పనుల్లో కొలతలు తేడాలు స్పష్టంగా కనపడుతున్నాయి. ఇప్పుడున్న ఇరుకు రోడ్డు దర్శనం ఇస్తోంది. తరచూ రద్దీగా ఉండే మూడురోడ్ల కూడలిలో మాత్రం 50 అడుగులకు తగ్గిపోయింది. మరలా సెంటర్ దాటిన తర్వాత విశాలంగా మార్కింగ్ చేశారు. ఒక్కో చోట ఒక పక్కకు ఎక్కువ గానూ మరొక చోట మరొక పక్కకు తక్కువగా మార్కింగ్ చేయడం తో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా సమానంగా తీస్తామని ప్రకటించి ఇప్పుడిలా చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఎవ్వరికో మేలు చేయడం కోసమే ఇలాంటి కొలతలు చేయడం సబబు కాదని సంబంధిత ఉన్నతాధికారులు కల్పించుకుని సమన్యాయం పలువురు కోరుతున్నారు.

మార్కింగ్‌పై ధర్మశ్రీ దష్టికి

కొత్తకోట లో రోడ్డు విస్తరణ మార్కింగ్ విషయాన్ని ఇటీవల పలువురు నాయకులు విప్ ధర్మశ్రీ దృష్టికి తీసుకువచ్చారు. సర్వే సిబ్బంది లాలూచీ పడటమో, లేదా బెదిరింపు లకు భయపడి తప్పుడు మార్కింగ్ ఇస్తే సహించ బోనని కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. గతంలోనే రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా 40 అడుగుల మేరకు మార్కింగ్ ఇవ్వాలని కలెక్టర్ నుంచి, ఆర్అండ్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఆ విధంగా సర్వే చేయాలని, విమ ర్శలకు తావివ్వవద్దని సిబ్బందిపై మండిపడ్డారు.

వడదెబ్బకు ఇద్దరు మృతి

బాబూరావు(ఫైల్)

చంటి(ఫైల్)

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని న్యాయంపూడి గ్రామానికి చెందిన పిల్లాని బాబూరావు(70) వడదెబ్బకు ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాబురావు కార్పెంటర్ గా పని చేస్తాడు. ఆదివారం మధ్యాహ్నం బయటికి వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత వడదెబ్బ కారణంగా సొమ్మసిల్లి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. దీనిపై రెవెన్యూ ,పంచాయతీ, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు సర్పంచ్ రెడ్డి వరహాలు తెలిపారు.

మండలంలోని దేవవరంలో మొల్లి చంటి(56) వడదెబ్బతో మరణించినట్లు ఎస్ఐ శీరిష తెలిపారు. ఆదివారం ఉదయం బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చిన తర్వాత వడదెబ్బకు అస్వస్థత కు గురై కూలి పోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించారు. ఈలోపు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు .

నగదు అందజేస్తున్న వెలగ నారాయణరావు

రూ.50 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్:స్థానిక ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ ప్రతినిధులు దాతృత్వాన్ని చాటుకున్నారు. స్థానిక కళాసి కాలనీ చెందిన మారంపూడి సత్యవతి కేన్సర్ వ్యాధితో బాధపడుతుంది.ఆమె ఎన్నారై వాసవి అసోసియేషన్ ప్రతినిధి వెలగా నారాయణరావును సంప్రదించి ఆర్థిక సహాయం చేయాలని కోరింది. నారాయణరావు స్పందించి ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ ద్వారా రూ.50వేలను ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆదివారం అందజేశారు. సరుకులు అందజేశారు. స్థానిక వ్యాపారులు సుతపల్లి శ్రీకాంత్ రామకృష్ణ, మెడికల్ స్టోర్ కొప్పర్తి కుమార్ ప్రతినెల వైద్య ఖర్చులు నిమిత్తం 3000 రూపాయలు చొప్పున అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ, ఎన్నారై వాసవి అసోసియేషన్ ద్వారా గతంలో కరోనా చాంబర్లు ఏర్పాటు చేశామన్నారు.

చోద్యం సర్పంచ్‌కు మాతృవియోగం

-పరామర్శించిన మాజీ మంత్రి అయ్యన్న

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ మాతృమూర్తి ఆదపురెడ్డి సత్యవతి (70) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. అనారోగ్య కారణంగా ఆమె గత 12 రోజుల నుంచి విశాఖపట్నం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం తెల్లవారు జామున గుండెపోటు రావడంతో ఆమె మృతి చెందారు. ఆమె మృతితో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి పద్మావతి సర్పంచ్ కుటుంబీకులను పరామర్శించి పార్థివదేహానికి నివాళ్లు అర్పించారు. మృతి చెందిన సత్యవతి మాజీ ఎంపిపి ఆదపురెడ్డి సత్యనారాయణ సతీమణి. ఆమె అంతిమయాత్రలో నర్సీపట్నం జెడ్పీటీసీ సుకల రమణమ్మ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు పెట్ల నారాయణమూర్తి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బొండల రాజబాబు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు నల్లబెల్లి శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు (ఇన్‌సెట్‌లో సత్యవతి)

శంకుస్థాపన చేస్తున్న నేతలు

కోల్డ్ స్టోరేజ్ భవనాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మాడుగుల:ఉద్యానవన శాఖ సబ్సిడీ నిధులతో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు సహకారంతో మండల కేంద్రంలో కోల్డ్ స్టోరేజ్ భవనాలు, కలెక్షన్ సెంటర్లకు శంకుస్థాపన నిర్వహించారు.వైఎస్ఆర్ క్రాంతి పథకం (వెలుగు ప్రాజెక్ట్) కు సంబంధించి శ్రీ మోదమాంబ గొర్రెలు, మేకలు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో సుమారు కోటి రూపాయల నిర్మాణ వ్యయంతో నిర్మించనున్నారు. ఈ నిర్మాణాలు పూర్తయితే ఏజెన్సీ వ్యాప్తంగా 11 మండలాల గిరిజనులు తమ వ్యవసాయ ఉత్పత్తులను అవసరం మేరకు నిలువ చేసుకునే సామర్థ్యం, ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీపీ పెదబాబు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఇటువంటి సౌకర్యం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కుక్కర్ శ్రీధర్, హేమంత్, ఎఫ్‌పిఓ సిసి దంగేటి ప్రసాద్ పాల్గొన్నారు.

హెటిరోపై పోరాడండి

సుప్రీం కోర్టు అడ్వకేట్ శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-నక్కపల్లి:న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యే వరకు మత్స్యకారులు ఐక్యంగా పోరాటం కొనసాగించాలని సుప్రీంకోర్టు అడ్వకేట్ శ్రావణ్ కుమార్ అన్నారు. హెటిరో కంపెనీ వేస్తున్న మూడు అడుగుల పైప్ లైన్ పూర్తిగా తొలగించాలని, పైప్ లైన్ వేసుకోవడానికి అనుమతులు ఇవ్వరాదని 551 రోజులుగా మత్స్యకారులు చేపడుతున్న మహా శాంతియుత ధర్నా శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశ్రమతో మంచి జరుగుతుందనుకున్న మత్స్యకారులకు నష్టం జరగడం బాధా కరమన్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు రావడంతో పాటు ఉపాధి పోయి కుటుంబాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేరేచోటకు వలసలు పోవాల్సివస్తోందన్నారు.పరిశ్రమ వల్ల పడుతున్న బాధలను, పర్యావరణ అంశాలను రాతపూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమస్య పరిష్కారం కోసం మత్స్యకారులంతా సమన్వయం చేసుకొని పోరాడుతూ తమ బతుకులను కాపాడుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు పిక్కి కామేశ్వరరావు, పిక్కిగంగరాజు, మైలపల్లిమహేష్ బాబు, గోసల సోమేశ్వరరావు, చేపల సోమేష్, మైలపల్లి భయ్యన్న, పిక్కి సత్తయ్య, వాసు పిల్లి స్వామి,వాసు పిల్లి నూకరాజు, చొక్కా కాశీ, కొండలరావు, స్వామి, మైలపల్లి బాపూజీ, మైలపల్లి శివాజీ, రమణ, కాశీ రావు, బొందలపు అప్పలరాజు, బొంది నూకరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రవణ్ కుమార్

నిర్మానుష్యంగా జాతీయ రహదారి

అగ్ని గుండంగా సన్ డే

ప్రజాశక్తి -నక్కపల్లి:ఎండలు మండి పోతు న్నాయి. విపరీతమైన వేడి గాలులు వీయడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఆదివారం అత్యధికంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఫ్యాన్లు, ఏసీలు కూడా సక్రమంగా పనిచేయలేదు. ఇళ్ల వద్ద ఫ్యాన్లు వేసుకుంటే వేడిగాలులు వీచాయి. వడగాల్పులు వీయడంతో జనం బయటకు రావడానికి సాహసించ లేదు. రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. వడగాల్పులకు జనం ఇళ్లల్లో ఉండలేక, బయటకు రాలేక నానా అవస్థలు పడ్డారు.తప్పని పరిస్థితుల్లో ప్రయాణం సాగించేవారు తగు జాగ్రత్తలు తీసుకుని ప్రయాణాలు సాగించారు.

నేడు కశిమిలో గడప గడపకు..

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 12న మండలంలోని కశిమి గ్రామ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ హాజరవుతారన్నారు. గడప గడప మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. నాతవరం మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపి సత్యవతి హాజరు కానున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గృహాల రద్దుకు నోటీసులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా జగనన్న కాలనీలు మంజూరైనా లబ్ధిదారులు వివిధ కారణాలతో నిర్మాణాలు చేపట్టక పోవడంతో అధికారులు వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు మండలంలో వివిధ గ్రామాలలో నిర్మాణాలు చేపట్టని 745 మందికి నోటీసులు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా జగనన్న లేఅవుట్ లో మంజూరైన లబ్ధిదారుల అధికంగా ఉన్నట్లు సమాచారం. మండలంలో నేటికీ ఇల్లు మొదలు పెట్టని లేఅవుట్ల వివరాలు ఇలా ఉన్నాయి. ఆక్సాహెబ్ పేట, అన్నవరం, బి కే పల్లి, రామచంద్ర పాలెం, రాజుపేట, వెంకటాపురం, జల్లూరు, పందూరు, తంగేడు, గ్రామాలలో లే అవుట్ నివాసయోగ్యానికి అనుకూలంగా లేక పోవడంతో ఇల్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు సుముఖత చూపలేదు. గృహ నిర్మాణానికి ఇస్తున్న రూ.1.80 లక్షలు కనీసం ఖర్చులకు కూడా రాలేదు.

పాఠశాలల పున:ప్రారంభాన్ని వాయిదా వేయాలి

నక్కపల్లి: మండుతున్న ఎండల తీవ్రత ను దృష్టిలో పెట్టుకొని పాఠశాలలు పున:ప్రారంభాన్ని వాయిదా వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు కోరారు. ఆదివారం ఆయన విలేకరలతో మాట్లాడుతూ, ప్రస్తుతం ఎండ తీవ్రత, వడగాల్పులు అధికంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రభావం విద్యార్థులపై పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరో మారు పునరాలోచన చేసి వాతావరణ పరిస్థితిని బట్టి పాఠశాలల ప్రారంభాన్ని వాయిదా వేయాలని కోరారు.

కానరాని మరుగుదొడ్లు

పట్టించుకునే నాథుడే కరువు

ప్రజాశక్తి -కోటవురట్ల: స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఏపీ అంటూ ప్రచారాలే కనిపిస్తున్నాయి కానీ ఎక్కడా అమలుకు నోచుకోలేదు. మండలంలో నిత్యం రద్దీగా ఉండే తహసిల్దార్ కార్యాలయం వద్ద మరుగుదొడ్లు సౌకర్యం లేక సిబ్బంది సహ వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపుగా ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వివిధ మండలాల ప్రజలు, వృద్ధులు, వికలాంగులు, మహిళలకు మూత్రవిసర్జనకు సైతం ఎటు వెళ్ళాలో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి కార్యాలయం వద్ద మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు.

కార్యాలయం వద్ద మూత్ర విసర్జన చేస్తున్న వ్యక్తి